కవర్ స్టోరీ



# తెలంగాణకు జీఐ జేజేలు

అనగనగా ఓ నేతన్న. చేనేత తనకు ఉపాధి మాత్రమే కాదు... ఉత్సాహం కూడా. ఆ పనిలో ఏదో కొత్తదనం చూపించాలనే ప్రయత్నం. కొత్త రూపాన్ని తీర్చిదిద్దాలనే తాపత్రయం. ఎవరు ఎగతాళిగా నవ్వినా, కోపగించుకున్నా... ఆ తపన ఆగలేదు. కొన్నాళ్లకు తను అనుకున్న వైవిధ్యాన్ని సాధించాడు. వెక్కిరించిన మాటలు తీరు మార్చుకున్నాయి. అపవాదులు కాస్తా అభినందనలయ్యాయి. ఒకరి తర్వాత మరొకరు ఊరు ఊరంతా, తన తోవలోనే నేత మొదలుపెట్టారు. ఒక్కడి ప్రయత్నం ఆ ఊరి ప్రత్యేకతగా మారింది. ఇకనుంచి ఆ ఊరు, అక్కడి చేనేత రెండూ అభిన్నమైపోయాయి. ఇలాంటి చరిత్రలు, కథలు మనం వినే ఉండి ఉంటాం. కానీ ఇప్పుడు దానికో కొనసాగింపు వచ్చింది. ఒక ప్రాంతానికే ప్రత్యేకమైన వ్యవసాయ లేదా పారిశ్రామిక ఉత్పత్తులు, ఆహారం, పానీయాలు, హస్తకళలకు జాగ్రఫికల్ ఇండికేషన్ అందించడం ద్వారా వాటికి అంతర్జాతీయ గుర్తింపు వచ్చే అవకాశం కలుగుతున్నది. ఒక ఉత్పత్తికి జాగ్రఫికల్ ఇండికేషన్ ట్యాగ్ రావడం అంటే మామూలు మాటలు కాదు. కచ్చితమైన వివరాలు అందించాలి, అధికారుల ప్రతి సందేహాన్నీ సమాధానపరచాలి, అవసరమైతే కోర్టులో సైతం నిరూపించుకోగలగాలి! ఇలాంటి కఠినమైన పరీక్షలన్నీ దాటి ఏండ్ల తరబడి నిరీక్షించిన తర్వాతే GI గుర్తింపు వస్తుంది. ఇప్పటివరకూ తెలంగాణలోని 17 వస్తువులకు అలాంటి గుర్తింపు వచ్చింది. 2022లో ఈ ట్యాగ్ అందుకున్న తాండూరు కందిపప్పు, ఈ ఏడాది జీఐ సర్టిఫికెట్ అందుకున్న హైదరాబాద్ లక్కగాజులను తల్చుకుంటూ... GI కథాకమామిషును గుర్తుచేసుకునే ప్రయత్నమిది!